సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం | 16 | జనవరి | 2025



తీగబారిన తీర్థాలు
ఢమరుక నాథాలు.. శూలాల విన్యాసాలు.. గజ్జెల లాగులు, శివసత్తుల పూనకాలతో ఐలోని, కొత్తకొండ జాతరలు హోరెత్తాయి.
- 8లో▸



ముగిసిన సెపక్‌తక్రా పోటీలు
తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో జరిగిన చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1^0/16.3^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మండలాలకు ప్రత్యేక అధికారులు
భూపాలపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి మండల ప్రత్యేక అధికారిగా వి.నారాయణరావు(డీపీఓ), చిట్యాలకు కె.చిన్నయ్య(డీడబ్ల్యూఓ), గణపురం మండలానికి కుమారస్వామి(డీవీఏహెచ్ఓ), కాటారం మండలానికి పి.నరేష్(డీఆర్‌డీఓ), మల్హర్‌కు ఆర్.అవినాష్(డీఎఫ్ఓ), మహదేవ్‌పూర్‌కు ఎం.వీరభద్రయ్య(డీఎల్‌పీఓ), మహాముత్తారానికి ఎ.వెంకటేశ్వర్లు(ఈడీఎస్సీ), మొగుళ్లపల్లికి డి.సునీత(డీఎస్సీడీఓ), రేగొండకు ఎ.సునీల్(హార్టికల్చర్ ఆఫీసర్), పలిమెలకు ఎం.విజయభాస్కర్(డీఏఓ), టేకుమట్ల మండల ప్రత్యేక అధికారిగా టి.శైలజ(డీబీసీడీఓ)ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి
భూపాలపల్లి అర్బన్: కోల్ ట్రాన్స్‌పోర్ట్ యాజమానులు స్పందించి లారీ ఓనర్ల సమస్యలను పరిష్కరించాలని సీనియర్ లారీ ఓనర్ తుమ్మేటి రాంరెడ్డి ప్రకటనలో కోరారు. లారీల కిరాయిలు పెంచాలని గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ఇప్పటి వరకు సింగరేణి యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టర్లు స్పందించడం లేదని తెలిపారు. లారీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4వేల మంది ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. సమ్మె వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కాసీంపల్లి వాసికి అవార్డు

సునీల్ యాదవ్

భూపాలపల్లి రూరల్: తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణకు కృషిచేస్తూ కవితలు, పాటలు, కథలు రాస్తున్న యువ రచయితకు అవార్డు దక్కింది. భూపాలపల్లి మున్సిపాలిటీ కాసీంపల్లికి చెందిన బేతు సునీల్ యాదవ్ జాతీయ యువ తేజం పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ వరల్డ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే సాహితీ సంబురాల్లో సునీల్ యాదవ్ ఈ అవార్డు అందుకోనున్నారు. ఇదిలా ఉండగా.. తను రాసిన పుస్తకాలు మట్టిచిప్ప, తునికాకు త్వరలో ప్రచురించనున్నట్లు సునీల్ యాదవ్ తెలిపారు.

20న జరిగే కేయూ దూరవిద్య పరీక్షలు వాయిదా
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యకు సంబంధించి ఈనెల 20న జరగాల్సిన పీజీ ఫస్ట్ సెమిస్టర్(నాల్గవ పేపర్ ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్‌మెటిక్స్) పరీక్షలు ఈనెల 24వ తేదీకి వాయిదా పడ్డాయి. ఆరోజు టీజీటెట్ పరీక్ష ఉన్నందున తేదీ మార్చినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగితా పరీక్షలు టైంటేబుల్ ప్రకారం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

సోలార్ ప్లాంట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి
ఏటూరునాగారం: ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పోడు భూముల హక్కు పత్రాలను కలిగిన గిరిజన రైతులు సోలార్ ప్లాంట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర బుధవారం అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష పవం ఉత్తమ్ మహాబియాన్ (పీఎం కుసుమ్) పథకం ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు ఉత్సాహం కలిగిన గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పీఓ తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు వల్ల కౌలు రైతులకు ఆదాయం వస్తుందన్నారు. అర్హులైన రైతులు ఈనెల 19లోపు ఐటీడీఏ, డీడీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కోటలో పర్యాటకుల సందడి


ఖిలా వరంగల్: సంక్రాంతి, కనుమ పండుగ నేపథ్యంలో బుధవారం కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటకు భారీగా సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. సనాతన్ ధర్మ కాలేజీ, న్యూఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు, ఇతర జిల్లాలతోపాటు నగర ప్రజలు కోటను సందర్శించారు. మధ్యకోట శిల్పాల ప్రాంగణం సందడిగా మారింది. శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను తిలకించారు. కాకతీయుల విశిష్టత, నిర్మాణ శైలిని కోట గైడ్ రవియాదవ్ పర్యాటకులకు వివరించారు. అనంతరం టీజీ టీడీసీ ఆధ్వర్యాన నిర్వహించిన సౌండ్ అండ్ లైటింగ్ షో వీక్షించారు.

‘సహకార’ పునర్విభజన

కొత్త మండలాలతో పాటు ప్రతిపాదిత ప్రాంతాల్లో ఏర్పాటు
- సభ్యుల నుంచి తీర్మానాల సేకరణ
- ప్రతిపాదనలు పంపిన పీఏసీఎస్ అధికారులు
- పరిశీలన తర్వాత గ్రీన్ సిగ్నల్‌కు అవకాశం



భూపాలపల్లి రూరల్: జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా టేకుమట్ల, పలిమెల, ఇటీవల కొత్తపల్లి(గోరి) కొత్త మండలాలుగా ఏర్పాటైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆయా మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ మండలాల రైతులు పాత మండలాల పీఏసీఎస్‌లకు వెళ్లి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తీసుకొని రావడానికి కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మండలాల్లో పీఏసీఎస్ ఏర్పడితే వారికి ఈ వ్యయప్రయాసలు తొలిగే అవకాశం ఉంది. నూతన మండలాలతోపాటు పలుచోట్ల వెసులుబాటును పరిశీలించిన కోఆపరేటివ్ అధికారులు జిల్లాలో కొత్తగా పలు పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించారు.

కోఆపరేటివ్ శాఖ పరిధిలోకి వచ్చే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ల పునర్విభజన చోటు చేసుకుంటుంది. కొత్త మండలాల్లో సంఘాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరాయి. జిల్లాల వారీగా వివరాలను అధికారులు ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. అందులో ఎన్నింటికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారో.. వేచి చూడాలి.

సాధ్యసాధ్యాల పరిశీలన

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ కమిషనర్ అండ్ రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రధానంగా కొత్త మండలాలు ఏర్పాటైన నేపథ్యంలో నిబంధనల మేరకు అక్కడ పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని కోరింది. ఒక్కో పీఏసీఎస్ పరిధిలో కనీసం 300 నుంచి 500వరకు రైతులకు సంబంధించి బ్యాంకు అకౌంట్లు కలిగి ఉండాలి. అలాగే అక్కడ పీఏసీఎస్ ఏర్పాటు చేస్తే బిజినెస్ నడుస్తుందా.. ఆర్థికంగా సొసైటీ నిలదొక్కుకోగలుగుతుందా...

జిల్లాలో పీఏసీఎస్‌లు ఇలా..

పాత పీఏసీఎస్‌లు	పీఏసీఎస్ ప్రతిపాదిత ప్రాంతాలు
1) భూపాలపల్లి	జంగేడు, పంబాపూర్
2) మల్హర్ తాడిచర్ల	కొయ్యూరు
3) మహదేవపూర్	పలిమెల
4) మహాముత్తారం	బోర్లగూడెం
5) మొగుళ్లపల్లి	మొట్లపల్లి
6) చిట్యాల	టేకుమట్ల, ఒడితెల
7) రేగొండ	కొత్తపల్లి (గోరి)
8) కాటారం	దామెర కుంట
9) గణపురం	
10) చెల్పూరు	

ఇలాంటి 47 అంశాలను పరిశీలించాలని సూచించింది. దానికి అనుగుణంగా డీసీఓలు వాటిని పరిగణలోకి తీసుకొని ప్రతిపాదనలు రూపొందించి ఆ వివరాలను ఆన్‌లైన్ ద్వారా అందజేశారు.

ప్రతిపాదనలు పంపించాం



నూతన పీఏసీఎస్‌లకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాం. అందులో ఎన్నిటికి ఆమోదం లభిస్తుందో ఇప్పుడే చెప్పలేం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌ల పరిధిలో కొన్ని గ్రామాలను విభజించి కొత్త సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాం.

- వాల్యానాయక్, డీసీఓ



ప్రయోజనాలు..

కొత్త పీఏసీఎస్‌లు ఏర్పడితే కొన్ని గ్రామాలకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు తదితర సొసైటీ నుంచి కొనుగోలు చేసేందుకు దూరభారం, ఆర్థిక భారం తగ్గుతుంది. సొసైటీకి అనుబంధంగా కోఆపరేటివ్ బ్యాంక్ కూడా ఏర్పడుతుంది. ఆ బ్యాంక్ పరిధిలో రైతులు రుణాలను సులువుగా పొందేందుకు ఆస్కారం ఉంటుంది. అంతే కాకుండా ఒక పీఏసీఎస్ ఏర్పడితే దానికి సంబంధించి పాలకవర్గం కూడా ఏర్పాటవుతుంది. అందులో 13 మంది సభ్యులు ఉంటారు. తద్వారా దాని పరిధిలోకి వచ్చే గ్రామాల వారికి రాజకీయంగా కూడా ఒక హోదా పొందేందుకు అవకాశం లభిస్తుంది. అయితే ఇప్పటివరకు జిల్లాలోని 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉమ్మడి వరంగల్ డీసీసీబీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మరో 9 పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానం చేసిపంపినట్లుగా సమాచారం.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో లక్ష పసుపుకొమ్ముల నోములో పాల్గొన్న వైశ్యులు



సంబురంగా సంక్రాంతి

- జోరుగా పతంగుల ఎగురవేత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భూపాలపల్లి అర్బన్: చూడముచ్చటైన రంగవల్లులు.. వాటి మధ్య అలంకరించిన గొబ్బెమ్మలు.. హరిదాసుల గీతాలాపనలు.. పిల్లలు, యువకుల గాలిపటాల ఆటలు.. పిండివంటల ఘుమఘుమలు.. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలు సంప్రదాయ బద్ధంగా నోములు నోముకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు ముంగిళ్లలో సంప్రదాయమైన ముగ్గులను వేసి రంగులతో అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆర్యవైశ్యులు లక్ష పసుపుగొమ్ములతో పంచవతి నోములు నిర్వహించారు. ముగ్గుల పోటీలతో మహిళలు, క్రీడాపోటీలు, కోడిపందేలతో యువకులు హోరెత్తించారు.





భూపాలపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

కాళేశ్వరం రాజగోపురం నుంచి మెట్ల మార్గం

పనులు ప్రారంభించిన అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం తూర్పు రాజగోపురం నుంచి శ్రీరామాలయం రోడ్డు వరకు మెట్ల మార్గం పనులను పంచాయతీరాజ్ అధికారులు ప్రారంభించారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో ఆలయ అభివృద్ధికి రూ.25కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఆ నిధుల నుంచి రూ.50లక్షల వ్యయంతో 100మీటర్ల పొడవుతో సెంట్రల్ లైటింగ్‌తో అధునాతనంగా నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా ఇప్పటికే ఉన్న సీసీ రోడ్డు డ్రిల్లింగ్ చేసి తొలగిస్తున్నారు. ఆ మెట్ల మార్గంలో సీసీతోపాటు టైల్స్ వేయనున్నారు. కాగా, తూర్పు రాజగోపురం వద్దకు గోదావరి నుంచి, ఇటు బస్టాండ్ మీదుగా వచ్చే వాహనాలు ఇక మీదట అనుమతి లేదు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు ఫణీంద్రశర్మ, పీఆర్ ఇంజనీర్లు ఉన్నారు.



పాతరోడ్డుకు డ్రిల్లింగ్ చేస్తున్న సిబ్బంది

క్రీడలు ఐకమత్యాన్ని పెంచుతాయి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: క్రీడలు ఐకమత్యాన్ని పెంచుతాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో సీనియర్, జూనియర్ గెట్ టు గెదర్ -2025 క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. అలాగే, భూపాలపల్లి జిల్లాలో క్రీడా సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ కారణాలతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు.



ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు బొకే అందజేస్తున్న క్రీడాకారులు

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం ఐడీఓసీ సమావేశపు హాల్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి విచారణ, గ్రామసభలు నిర్వహణపై రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, డీఆర్డీఓ, పౌర సరఫరాలు, గృహ నిర్మాణం, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విచారణ, గ్రామసభలు నిర్వహణకు వివిధ శాఖల అధికారులతో టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి, లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేయాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో 16 నుంచి 20వ తేది వరకు క్షేత్రస్థాయి విచారణ, 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించే విధంగా షెడ్యూల్ తయారు చేసినట్లు సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి విచారణ, గ్రామసభల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ క్రికెట్ జట్టు

కేయూ క్యాంపస్: చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో ఈనెల 16 నుంచి నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు కేయూ క్రికెట్ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య బుధవారం తెలిపారు. జట్టులో బి.విశాల్ యాదవ్, బి.వరుణ్, జి.హరిప్రసాద్, షేక్ సమీర్‌పాషా(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ హనుమకొండ), కె.నిఖిల్ (యూఏఎస్‌సీ హనుమకొండ), కె.రోహిత్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహిమ్(కిట్స్ వరంగల్), బి.కిరణ్ (యూసీపీఈ కేయూ వరంగల్), షేక్ అజహర్, బి.సంతోష్(ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ఖమ్మం), ఆర్.శ్రీచరణ్(జీఆర్‌బీ డిగ్రీకాలేజీ ఆదిలాబాద్), బి.సచిన్ (యూసీఈ కేయూ ఖమ్మం), ఆమ్‌గోత్ డివిన్(కేఎండీసీ ఖమ్మం), మహ్మద్‌ఫర్హాన్(మాస్టర్జీ డిగ్రీకాలేజీ హనుమకొండ) ఉన్నారు. వీరికి హనుమకొండలోని కేశవ డిగ్రీకాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎం.కుమారస్వామి కోచ్‌గా, హనుమకొండలోని గీతాంజలి డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మహ్మద్ మహమూద్‌అలీ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.



ఎంపికైన జట్టుతో వెంకయ్య

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో మంత్రి సీతక్క

గోవిందరావుపేట: క్రీడల్లో గెలుపోటములు సహజం అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని చల్వాయిలో ‘చల్వాయి వాలీబాల్ యూత్’ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుండగా.. చివరి రోజు మంగళవారం రాష్ట్ర మంత్రి సీతక్క హాజరయ్యారు. చివరి రోజు ఫైనల్ మ్యాచ్‌లో మురుమురు గ్రామ జట్టు గెలుపొందగా.. వారికి రూ.15,016 రుపాయలు ప్రథమ బహుమతి, కొంగల గ్రామ జట్టుకు రూ.10,016 ద్వితీయ బహుమతి, చల్వాయి గ్రామ జట్టుకు రూ.5,016 తృతీయ, గంగారం గ్రామ జట్టుకు 3,016 నాలుగో బహుమతిని సీతక్క అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆటలు ఆడడం వల్ల మానసిక, శరీరక, సామాజిక, భావోద్వేగ, అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఇండియా వాలీబాల్ మహిళా జట్టు కోచ్ కోసరి కృష్ణప్రసాద్, భేతి రవిందర్‌రెడ్డి, చుంచు రమణ, తమ్మివెట్టి శ్రీను, ఏదుల వేణు, మేకల కృష్ణ, తాటి సుమన్, కన్నెబోయిన సతీశ్, మద్దెల శ్రీనివాస్, సాయబోయిన భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పులకించిన మల్లూరు

- వైభవంగా హేమాచలుని వరపూజా మహోత్సవం
- కొనసాగుతున్న జాతర

మంగపేట: మండలంలోని మల్లూరులో సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీ హేమాచల లక్ష్మీనృసింహ స్వామి వరపూజ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రావణం సత్యనారాయణ పర్యవేక్షణలో లక్ష్మీనృసింహస్వామి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వరపూజ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయం ఎదుట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో మూడు గంటల పాటు కొనసాగిన ఈ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జయజయద్వానాలతో మల్లూరు పులకించింది. స్వామివారికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ, ప్రధానార్యకులు రాఘవాచార్యులు దేవతా మూర్తుల తరపున శ్రీ మల్లూరు శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయ పూజారి అనిపెద్ది నాగేశ్వర్‌రావు పెద్దలుగా వ్యవహరించి స్వామికి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలను అందజేశారు. ప్రతీ ఏటా హేమాచల క్షేత్రంలో నిర్వహించే స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని మే 12న నిర్వహించేందుకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. భక్తులు అర్ధరాత్రి తర్వాత కూడా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కాంతులీనిన మల్లూరు

జాతరకు తరలివచ్చిన భక్తులు స్వామివారి వరపూజా మహోత్సవాన్ని తిలకించేందుకు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. స్వామివారి వరపూజా మహోత్సవ మండపం నుంచి బొడ్రాయి సెంటర్ వరకు జాతర జరిగే రోడ్లకు ఇరువైపులా రంగుల లైట్లతో అలంకరించారు. స్వామివారి వరపూజా మహోత్సవం మంగళవారం రాత్రితో ముగిసినప్పటికీ బుధవారం సాయంత్రం వరకు జాతర కొనసాగుతూనే ఉంది. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మంత్రి సీతక్క తనయుడు ధనసరి సూర్యను అర్చకులు సన్మానించారు. స్వామువారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్సై టీవీఆర్ సూరి పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. జయరాంరెడ్డి, యానయ్య, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు. మల్లూరుగుట్టపై ఉన్న హేమాచల క్షేత్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వయంభుగా వెలిసిన స్వామివారికి ఆలయ అర్చకులు కైకర్యం రాఘవాచార్యులు, ముక్కామల శేఖర్ శర్మ, కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు.



ఉత్సవ మూర్తులకు వరపూజా మహోత్సవం జరిపిస్తున్న పూజారులు

వైభవంగా కనుమ వేడుకలు

వేయిస్తంభాల ఆలయంలో గోపూజ

హన్మకొండ కల్చరల్ : సంక్రాంతి పండుగలో భాగంగా బుధవారం కనుమ వేడుకలను ప్రజలు ముఖ్యంగా రైతులు వైభవంగా జరుపుకున్నారు. హనుమకొండ వేయిస్తంభాల దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ సౌజన్యంతో గోపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోమాతను పూమాలతో అలంకరించి పచ్చగడ్డి, శనగపిండి, అరటిపండ్లు సమర్పించి హారతి ఇచ్చారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన అర్చకులు శ్రీరుద్రేశ్వరస్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేపూజలు చేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. గోవులు లక్ష్మీస్వరూపమం.. పశువులను దైవంగా పూజించాలని అన్నారు. కార్యక్రమంలో వేదపండితులు గంగు మణికంఠ, అర్చకులు ప్రణవ్, శ్రవణ్, గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.



గోపూజ నిర్వహిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

క్లుప్తంగా

ఎన్పీడీసీఎల్‌కు నాలుగు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణకు నాలుగు ఇప్పాయి (ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) అవార్డులు లభించాయి. ఈనెల 11వ తేదీన కర్నాటక రాష్ట్రం బెల్గామ్‌లో నిర్వహించిన 25వ రెగ్యులేటరీ అండ్ పాలసీ మేకర్స్ రిట్రీట్‌లో ఎన్పీడీసీఎల్ సీజీఎం ఆపరేషన్ రాజు చౌహాన్ అవార్డులు అందుకున్నారు. కాగా, హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు కలిసి అవార్డులను అందజేశారు.

ఐదు కిలోల ఎండుగంజాయి పట్టివేత



గంజాయిని చూపుతున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు

కేసముద్రం: ఐదు కిలోల ఎండుగంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలోని కోరుకొండపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడుకు చెందిన పఠాన్ అస్లాంఖాన్, వైజాగ్‌కు చెందిన వెదుల ప్రదీప్‌కుమార్.. వైజాగ్ సమీపంలోని సీలేరు నుంచి ఎండు గంజాయిని కారులో తరలిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు కోరుకొండపల్లి క్రాస్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఈ మేరకు రూ.1.25లక్షల విలువైన ఐదు కిలోల ఎండు గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

తొమ్మిది పిల్లలకు జన్మనిచ్చిన జర్మన్ షఫర్డ్



డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్ల సంకీస గ్రామానికి చెందిన గండు రవి రెండేళ్ల క్రితం జర్మన్ షఫర్డ్ డాగ్‌ను కొనుగోలు చేశాడు. మూడు రోజుల క్రితం అది తొమ్మిది పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఏరకం కుక్కలైనా ఒక కాన్పులో నాలుగు నుంచి ఐదు పిల్ల లకు జన్మనిస్తుంది. ఒకేసారి తొమ్మిది పిల్లలకు జన్మనివ్వడం అరుదైన విశయమని డోర్నకల్ పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. పిల్లలు అన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని రవి తెలిపారు.

తీగబారిన తీర్థాలు..

ఐలోని, కొత్తకొండ జాతరలకు పోటెత్తిన భక్తజనం

- బోనాలు, పట్నాలు, కోడెలు కట్టి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- స్వామి వార్లను దర్శించుకున్న ప్రముఖులు



ఐనవోలు: ఢమరుక నాథాలు.. శూలాల విన్యాసాలు.. జాలి ముసుగులు..గజ్జెల లాగులు, శివసత్తుల పూనకాలతో ఐనవోలు మల్లన్న క్షేత్రం మకర సంక్రాంతి పర్వదినాన మంగళవారం హోరెత్తింది. జాతర ఉత్సవాల్లో భాగంగా శివసత్తులు భక్తి పారవశ్యంతో నెత్తిన బోనం ఎత్తుకుని నాట్యం చేస్తూ స్వామివారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కాలినడకన, వివిధ వాహనాల్లో వేలాదిగా తరలివచ్చారు. జాతర ప్రాంగణంలో బోనాలు అలంకరించి వాటిపై దీపం వెలిగించారు. బోనం ఎదుట పట్నం వేయించి ఒగ్గుపూజారులతో మల్లన్నను స్తుతింప చేశారు. సంతాన సాఫల్యం కోసం కొందరు మహిళలు ఆలయం చుట్టూ తడి బట్టలతో వరం పట్టారు. కోర్కెలు తీరిన భక్తులు మల్లన్నకు కోడెలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.కాగా, మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఐలోనిలో బోనం ఎత్తుకుని నృత్యం చేస్తున్న భక్తులు

మార్నేని వంశస్తుల పెద్దరథం

మార్నేని వంశస్తులు తమ కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన చీర, సారె, ఒడిబియ్యం, పసుపు, కుంకుమను ఒక పెట్టెలో భద్రపరించారు. పెద్ద పూల(శిడి) రథాన్ని అలంకరించి ఆ పెట్టెను అందులో ఉంచారు. టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఇంటి వద్ద నుంచి శిడిరథం(రాత్రి ప్రబల బండి) సాయంత్రం 6.30కి బయలుదేరింది. గ్రామంలో వీధి వీధిన తిరుగుతుండగా భక్తులు రథానికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని తూర్పు ద్వారం వద్ద రథంలో వెంట తెచ్చిన పెట్టెను ఆలయంలోకి తీసుకెళ్లి తమ మొక్కులు అప్పజెప్పారు. రథ నిర్వాహకుడు మార్నేని రవీందర్‌రావు-మధుమతి దంపతులను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్ సన్మానించారు. కాగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ రాష్ట్రనాయకులు వన్నాల వెంకట రమణ, కొండేటి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి.. మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం.. చారిత్రక మల్లన్న ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. బుధవారం ఎండోమెంట్ వరంగల్ డీసీ సంధ్యారాణి, ఏసీ సునీత.. స్వామి వారిని దర్శించుకున్నారు.



విద్యుత్ కాంతులతో ఐలోని మల్లన్న క్షేత్రం



కొత్తకొండలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వీరభద్రుడి సన్నిధిలో..

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. స్వామి వారిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. భద్రకాళి సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా, ముందు ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజుతో కలిసి మాట్లాడారు. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విరాజిల్లాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ఎండ్లబండ్ల రథాలు..

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం కొత్తపల్లికి చెందిన సుమారు 75 ఎడ్లబండ్లను రథాలుగా అలంకరించుకుని గ్రామస్తులు సాయంత్రం 5గంటలకు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా కొత్తకొండ జాతరకు బయలు దేరాయి. మహిళలు రథాలకు హారతులిచ్చి సాగనంపారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, హనుమకొండ తదితర జిల్లాల నుంచి సుమారు లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు. కాగా, బుధవారం కనుమ ఉత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటప పూజ, నందీశ్వర పూజ, హారతి, మంత్రపుష్పం, బలిహరణ నిర్వహించారు. ఈ వేడుకల్లో అర్చకుడు వినయ్‌శర్మ, రాజన్న, సదానందం, రాంబాబు, వీరభద్రయ్య, ఆలయ ఈఓ కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో సీఐలు పులి రమేష్, ప్రవీణ్‌కుమార్, పుల్యాల కిషన్ ఎస్సైలు సాయిబాబు, దివ్యతో పాటు 450మంది పోలీసులు జాతరలో బందోబస్తు నిర్వహించారు. కాగా, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, డీఎంహెచ్ఓ అప్పయ్య, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, బీజేపీ నేత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వొడితెల ప్రణవ్ స్వామివారిని దర్శించుకున్నారు.



గుమ్మడి కాయతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

నిర్వహణ లోపంపై మంత్రి అసహనం

కొత్తకొండ జాతర నిర్వహణపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు, పాలకవర్గ కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లోపించింది. దీంతో జాతర విధుల నిర్వహణకు వచ్చిన కొందరు పోలీస్ అధికారుల ప్రవర్తనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అదే సమయంలో దేవాదాయ శాఖ అధికారులపై భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో వీటిని గ్రహించిన మంత్రి అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గర్భగుడిలోకి వెళ్లకుండా బయటనుంచే మొక్కులు చెల్లించి వెళ్లిపోయారు. ఆలయ వసతి గృహం వద్దకు చేరుకున్న ఆయన అక్కడ నేలపై కూర్చుని నిరసన తెలిపారు. మంత్రి ప్రభాకర్ వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, పార్టీ నాయకులు ఉన్నారు.



కొత్తకొండ జాతరలో ఆకట్టుకున్న మేకల రథం

హత్యచేసి.. పూడ్చిపెట్టారా?

- వివాహితను చంపినట్లు ప్రచారం
- మానుకోట సిగ్నల్‌కాలనీలో ఘటన
- రెండు రోజుల క్రితం పోలీసులకు సమాచారం



వివాహితను హత్యచేసి పూడ్చిన చోటుగా అనుమానిస్తున్న ప్రాంతం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో ఓ వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టారనే ప్రచారం బుధవారం కలకలం రేపింది. సదరు వివాహిత సంబంధీకులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. కాగా, వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సిగ్నల్ కాలనీకి చెందిన భూపతి అంజయ్య ఇంట్లో సుమారు 3 సంవత్సరాల నుంచి పాటిలక్ష్మి, రాములు దంపతులు తమ కుమారుడు గోపి, కోడలు నాగమణి (35), కుమార్తె దుర్గా, అల్లుడు మహేందర్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా, వీరంతా వాటర్ అమ్మడం, చెత్త కాగితాలు ఏరుకోవడం, ఇతర కూలీ పనులు చేస్తూ ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి సమయానికి వస్తుంటారు. గోపి సుమారు ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలో భర్త తనను పట్టించుకోవడం లేదని భార్య నాగమణి రెండు నెలల క్రితం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మళ్లీ కొద్ది రోజులుగా గొడవలు జరుగుతుండడంతో ఈ క్రమంలోనే అత్తామామ, ఆడపడుచు, భర్త కలిసి నాగమణిని హత్య చేసినట్లు తెలిసింది. మృతి చెందినట్లు అనుమానిస్తున్న నాగమణి ఆడపడుచు దుర్గా కుమార్తెలు మౌనిక, మానస తమ అత్తను మామ, అమ్మమ్మ, తాత, మా అమ్మ కలిసి చంపారని కాలనీవాసులతో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఘటన జరిగిన వెంటనే అదే సమయంలో అక్కడే ఉన్న లక్ష్మి తమ్ముడు వారిని నిలదీయగా అతడిపై వేడినీళ్లు పోయడంతో గాయపడి అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను వివరణ కోరగా వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారనే అనుమానంపై సిగ్నల్ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి యజమాని అంజయ్యకు సమాచారం ఇచ్చామని, అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్‌లోని ఇందిరా నగర్ కాలనీలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కూలీ పనిచేసుకునే గుడెల్లి రాజు (37) కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల చుట్టు తిరిగినా నయం కావడం లేదు. దీంతో మనస్తాపం చెందిన రాజు.. బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు.

మంగపేటలో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

మంగపేట: మండల కేంద్రానికి చెందిన చెట్టి నాగమ్మ(80) మండల కేంద్రం పరిధిలోని సంద్రోని ఒర్రె అటవీ ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగమ్మ భర్త చాలా కాలం క్రితం మృతి చెందగా మండల కేంద్రంలోని సినిమాహాల్ వీధిలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం సంద్రోని ఒర్రె అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పశువుల కాపరులకు అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు.

రెగ్జిన్ షాపుల్లో చోరీ

- రూ.3 లక్షల విలువైన సామగ్రి అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారులోని రెండు రెగ్జిన్ షాపుల్లో చోరీ జరిగింది.ఈ ఘటనలో రూ.3 లక్షల మేరకు సామగ్రి అపహరణకు గురైంది. బాధితుల కథనం ప్రకారం.. శనిగపురం శివారులో ముత్యాల రాజేశ్, పెంద్ర నాగరాజు రెగ్జిన్ షాపులు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే మంగళవారం తమ షాపులు బంద్ చేసి ఇళ్లకు వెళ్లారు. బుధవారం మళ్లీ షాపులు తెరుద్దామని వచ్చి చూడగా వెనుక వైపున ఉన్న రేకులను తొలగించి దొంగలు చోరీకి పాల్పడిన విషయాన్ని గమనించారు. రాజేశ్ షాపులో రూ.2 లక్షలు, నాగరాజు షాపులో రూ. లక్ష విలువైన సామగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. కాగా, గతంలోనూ మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీసుస్టేషన్ల పరిధుల్లో సుమారు ముప్పైకిపైగా రెగ్జిన్ షాపుల్లో చోరీలు జరగగా ఫిర్యాదులు చేసినా ఆచూకీ లభించలేదని బాధితులు పేర్కొన్నారు.

బైక్ ఢీ.. మహిళా కూలీ మృతి



లక్ష్మి (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందింది.ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బైరాన్‌పల్లికి చెందిన బండి లక్ష్మి(56) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. మంగళవారం రాత్రి కిరాణా షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరింది. హనుమకొండ నుంచి సిద్దాపురం వైపునకు వస్తున్న ఓ బైక్ లక్ష్మిని ఢీకొనగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పోలంపల్లిలో కారు ఢీకొని వృద్ధురాలు..



సమ్మక్క (ఫైల్)

కాటారం: ఇంటి ముందు చలిమంట కాచుకుంటున్న ఓ వృద్ధురాలిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మహాముత్తారం మండలం పోలంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరినేని సమ్మక్క (60) ఈ నెల 13న రాత్రి తన ఇంటి ఎదుట చలిమంట కాచుకుంటుంది. ఈ క్రమంలో ఓ కారు.. సమ్మక్కను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో గమనించిన సోదరుడు మానేటి బాపు 108లో భూపాలపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మానేటి బాపు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ కాటారం మండలం మేడిపల్లికి చెందిన గుంటి రాకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిప్పంటుకుని గృహిణి..

జనగామ: నిప్పంటుకుని ఓ గృహిణి మృతి చెందింది.ఈ ఘటన జనగామ పట్టణం గుండ్లగడ్డలో చోటు చేసుకుంది. ఎస్సై చెన్న కేశవులు కథనం ప్రకారం.. గుండ్లగడ్డకు చెందిన అనిష్ బేగం(36) ఈ నెల 14న ఇంట్లో గ్యాస్ పొయ్యిపై పాలు వేడి చేస్తోంది. ఈ సమయంలో మంటలు చెలరేగి ఆమెకు అంటుకున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మహబూబ్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి వృద్ధుడు..



వెంకటియా మృతదేహం

కేసముద్రం: ఎస్సారెస్పీ ఉపకాల్వలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని క్యాంపు తండాజీపీ శివారు రాంసింగ్‌తండాలో చేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు కథనం ప్రకారం..తండాకు చెందిన బానోత్ వెంకటియా(70) తన ఇంటి ఎదుట ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ వద్దకు వెళ్లాడు. కాలుజారడంతో అందులోపడి నీటమునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షో విజయవంతం



సక్సెస్ మీట్‌లో సభ్యులు

కాజీపేట: రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత ఏర్పడిన నేపథ్యంలో వరంగల్ జిల్లా క్రెడాయ్ కార్యవర్గం వినూత్నంగా ఆలోచించి కొత్త సంవత్సరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రాపర్టీ షోతో రియల్ రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చామని క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు, పాంచజన్య డెవలపర్స్ చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ పీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ప్రతి ఒక్కరి స్వప్నమైన సొంత ఇల్లుకు సంబంధించిన ప్రతి వస్తువు చివరకు ఇంటికి తాళం వరకు స్టాళ్లలో ఏర్పాటు చేశామన్నారు. ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, విల్లాలు, బ్యాంకర్లు, ఇంటీరియర్ ప్రొడక్ట్స్, శానిటరీ, లిఫ్ట్, కార్లు, సోలార్, టైల్స్, పెయింట్స్, యూపీవీసీ విండోస్ తదితర స్టాళ్లకు చక్కటి ఆదరణ లభించిందన్నారు. సంతృప్తికర వ్యాపారం సాగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయిని అమరేందర్ రెడ్డి, శాఖమూరి అమర్, ఎం.రవీందర్ రెడ్డి, జారతి మనోహర్, లెక్కల రజనీకాంత్ రెడ్డి, మెతుకు రాజ్‌కుమార్, గాదె రాజేందర్ రెడ్డి, వెంకట మల్లారెడ్డి, వరుణ్ అగర్వాల్, యూత్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

దామెరలో దొంగల హల్‌చల్

- రూ.6. 68 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలంలో దొంగలు రెచ్చిపోయారు. దామెర, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్, ఒగ్లాపూర్ గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. సుమారు రూ. 6 లక్షల 68 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. శాయంపేట సీఐ రంజిత్ రావు కథనం ప్రకారం.. రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు ముస్త్యాలపల్లికి చేరుకుని గ్రామానికి చెందిన శాతరాశి ఈశ్వరమ్మ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 2 తులాల బంగారం, రూ.50 వేల నగదు చోరీ చేశారు. తక్కళ్లపహాడ్‌లోని పలు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేసి సాధ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. అనంతరం ఒగ్లాపూర్ చేరుకుని కనుకుంట్ల జ్ఞానేశ్వర్ ఇంటి తాళం పగలగొట్టి రూ.లక్ష నగదు, 15 తులాలవెండి ఆభరణాలు అపహరించారు. అక్కడి నుంచి దామెరకు చేరుకుని మాదారపు విజయ కిరాణా షట్టర్ తెరిచి అందులో ఉన్న 7 తులాల బంగారం, 13 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు మంగళవారం ఉదయం తమ ఇళ్లకు వెళ్లి పరిశీలింగా చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పరకాల ఏసీపీ సతీ శ్‌బాబు, శాయంపేట రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంగళవారం తెలిపారు.

ముగిసిన సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందుకుంటున్న ఆలిండియా పోలీస్ టీం

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదు రోజుల పాటు కొనసాగిన 34వ సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి 24 మహిళల జట్లు, 28 పురుషుల జట్లతో పాటు ఆల్ ఇండియా పోలీస్, ఎస్ఎస్‌బీ జట్లు పాల్గొన్నాయి. టీం, డబుల్స్, రేగు, క్వాడ్ విభాగాల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉత్కంఠ పోరులో ఆల్ ఇండియా పోలీస్ మెన్ అండ్ ఉమెన్ జట్లు డబుల్స్, రేగు, క్వాడ్ ఈవెంట్లలో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఆతిథ్య తెలంగాణ క్రీడాకారులు డబుల్స్ ఈవెంట్‌లో ఉమెన్ టీం రెండో స్థానంలో, మెన్ టీం మూడో స్థానంలో నిలిచాయి. మిగిలిన మూడు ఈవెంట్లలో క్వార్టర్ ఫైనల్స్‌లోనే ఇంటికి చేరాయి. మంగళవారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలకు సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ యోగేందర్ సింగ్ దయ్యా, పీసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రిక్కల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్నాథస్వామి, ప్రేమ్‌రాజ్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కునమల్ల జితేంద్రనాథ్, బాధ్యులు ధన్‌రాజ్, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు ఇలా..

మెన్	ఉమెన్
టీం ఈవెంట్	
మణిపూర్	ఎస్ఎస్‌బీ
ఢిల్లీ	నాగాలాండ్
ఎస్ఎస్‌బీ	మణిపూర్
అస్సాం	ఉత్తరప్రదేశ్
డబుల్స్ ఈవెంట్	
ఆల్ఇండియా పోలీస్	ఆలిండియా పోలీస్
బిహార్	తెలంగాణ
హరియాణా	ఢిల్లీ
తెలంగాణ	కేరళ
రేగు ఈవెంట్	
ఆలిండియాపోలీస్	ఆలిండియాపోలీస్
ఢిల్లీ	హరియాణా
మణిపూర్	నాగాలాండ్
రాజస్థాన్	ఎస్ఎస్‌బీ
క్వాడ్ ఈవెంట్	
ఆలిండియా పోలీస్	ఆలిండియా పోలీస్
ఎస్ఎస్‌బీ	మణిపూర్
మణిపూర్	ఎస్ఎస్‌బీ
బిహార్	నాగాలాండ్